క్లుప్తంగా

వేడుకగా బోనాలు



దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలోని బీరన్న ఆలయంలో బీరయ్య, కామరాతి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను పురస్కరించుకుని కురుమ కులస్తులు శుక్రవారం పోచమ్మ, పెద్దమ్మ బోనాలు వేడుకగా నిర్వహించారు. పోచమ్మ, పెద్దమ్మలకు ప్రత్యేక బోనం అలంకరించి డప్పుచప్పుళ్లతో ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కురుమ కులపెద్దలు, ఉత్సవ కమిటీ బాధ్యులు, కులస్తులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన మాజీ ఎంపీపీ

చెన్నారావుపేట : బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు, అమీనాబాద్ క్లస్టర్ ఇన్‌చార్జ్, మండలంలోని జల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి శుక్రవారం సొంత గూటికి చేరారు. ఆయనతోపాటు సుమారు 40 కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో శుక్రవారం చేరాయి.

నిట్‌లో శిక్షణకు విద్యార్థుల ఎంపిక



నెక్కొండ : వరంగల్‌లోని ప్రతిష్ఠాత్మక నిట్‌లో శుక్రవారం మొదలైన శిక్షణకు మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం రంగారావు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న సిద్ధార్థ, అర్చన, సరస్వతి, రాకేశ్, అబూబకర్ సిద్ధిఖ్, రక్షిత శిక్షణకు ఎంపికవగా వారిని హెచ్‌ఎంతోపాటు గైడ్ టీచర్ ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. రసాయన శాస్త్రంలో ప్రయోగాలపై ఈనెల 5 వరకు విద్యార్థులు శిక్షణ పొందుతారని చెప్పారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

కాశిబుగ్గ : పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. నెక్కొండ మండలంలోని టీకులతండాకు చెందిన భూక్య మాజీ (59) హైదరాబాద్‌లో ఉంటున్న కూతురు లక్ష్మి దగ్గరికి వెళ్లేందుకు నెక్కొండ రైల్వే స్టేషన్ యార్డులో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాజీ అక్కడికక్కడే మృతి చెందింది. డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని మృతురాలి కోడలు శ్రీదేవికి అప్పగించినట్లు సీఐ వివరించారు.

గుడుంబా స్వాధీనం.. కేసు నమోదు



వర్ధన్నపేట : మండలంలోని డీసీ తండా శివారులో శుక్రవారం నాలుగు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నీలగిరిస్వామి తండాకు చెందిన బానోతు సోమ్లా ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గుడుంబా లభించినట్టు సీఐ మీడియాకు వెల్లడించారు. గుడుంబాతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని సోమ్లాపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ఆర్థికసాయం



వర్ధన్నపేట : పట్టణానికి చెందిన పొన్నం గణేశ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి గణేశ్ పదో తరగతి నాటి మిత్రులు శుక్రవారం రూ.21,500 సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మిత్ర బృందం అధ్యక్షుడు నాగెల్లి రవీందర్ మాట్లాడారు. తమ స్నేహితుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు జన్ను నవీన్‌బాబు, అబ్దుల్ షఫీ, సుభాష్, శ్రీనివాస్, శ్యామ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలపై ఎండ ఎఫెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రాజకీయ పార్టీలపై ఎండ ఎఫెక్ట్ భారీగా పడుతోంది. మండుటెండల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార సరళిలో మార్పులు చేసుకుంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించిన ప్రచార జోరు పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్నా ఇప్పుడు కనిపించడం లేదు. ఎండ, వడగాడ్పుల దెబ్బకు రాజకీయ పార్టీల నాయకులు తెల్లవారుజామునే ప్రజల్లోకి వెళ్తున్నారు. ఉదయం 9 గంటలలోపు ప్రచారం నిర్వహిస్తూ సాయంత్రం 5 గంటల తర్వాత శ్రేణులతో, ఓటర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరందుకోగా ఉదయం 6 గంటల వరకల్లా కూలీలు పనికి వెళ్తున్న పరిస్థితి కనడపుతోంది. ఈ క్రమంలో రాజకీయ పార్టీల నాయకులు కూలీల వద్దకు ఉదయం 8 గంటలకల్లా చేరుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

మండలాల వారీగా సమావేశాలు

ఎండల తీవ్రత నేపథ్యంలో రాజకీయ పార్టీలు రోజుకో మండలంలో ఫంక్షన్ హాళ్లలో సమావేశాలు నిర్వహిస్తూ గెలుపు దిశగా బాటలు వేసుకుంటున్నాయి. అదే సమయంలో ఎండ వేడి, ఉక్క పోత నుంచి ఉపశమనం కల్పించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీల నాయకులు ఫంక్షన్ హాళ్లకు శ్రేణుల ద్వారా ఓటర్లను రప్పించుకుని మచ్చిక చేసుకుంటున్నారు. శుభ, అశుభ కార్యాలయాలకు వెళ్లి ప్రజలను నేరుగా కలుస్తున్నారు.

మండల స్థాయి నేతల ఇంటింటి ప్రచారం

వారం రోజులుగా జిల్లాలో ఎండల 40–45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండడంతో ఉక్కపోత అధికంగా ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండల స్థాయి నాయకులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. నాయకులు సాయంత్రం సమావేశాలు నిర్వహిస్తున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



గీసుకొండ : మాట్లాడుతున్న ధర్మారెడ్డి

గీసుకొండ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని ఆయన చెప్పారు. వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచిన డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని వంచనగిరి, శాయంపేట, ఊకల్, మరియపురం, గంగదేవిపల్లి, కోనాయమాకుల, గీసుకొండ, రాంపూర్, గట్టుకింది పల్లె, బాలయ్యపల్లె, మనుగొండ, చంద్రయ్యపల్లి, తదితర గ్రామాల్లో ఆ పార్టీ ముఖ్యనాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ధర్మారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. సుధీర్ కుమార్‌ను గెలిపించే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీరగోని రాజ్‌కుమార్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి, నాయకులు ముంత రాజయ్య, కొల్పుల కట్టయ్య, డోలె చిన్ని, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్లపై ప్రమాణాలతో మోసానికి..

సంగెం : ప్రజలను నమ్మించి ఓట్లు దండుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ప్రమాణాలతో మోసానికి తెగబడుతున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని చింతలపల్లి, వంజరపల్లి, కృష్ణానగర్, సంగెం, కుంటపల్లి, కాట్రపల్లి, వెంకటాపూర్‌ల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే ఆరు గ్యారంటీలను అమలు చేసి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌పైనే ప్రజలకు నమ్మకం ఉందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను ఎంపీగా గెలిపించాలి



మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

● టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పోరిక బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి కోరారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఓటర్లకు కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను అందించి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఉపాధి కూలీలకు దినసరి వేతనాన్ని రూ.400కు పెంచుతుందని చెప్పారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగుల హరీశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివ, మండల అధ్యక్షుడు సిగం ప్రశాంత్, నాయకులు దేవి సుబ్బారెడ్డి, కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికృష్ణ, అన్వర్‌పాషా, రావుల మహిపాల్‌రెడ్డి, రావుల నర్సింహారెడ్డి, బొమ్మరబోయిన రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో బీజేపీ పతనం ఖాయం'



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పతనం ఖాయమని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు కనకం రమేశ్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో హింసాయుత పాలన కొనసాగుతోందని ఆయన ధ్వజమెత్తారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టి సామాన్య ప్రజలపై భారాలు మోపారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు అబ్బిడి రాజిరెడ్డి, ఎద్దు సత్యనారాయణ, మైస సురేశ్, మునిగాల రవీందర్, పోశాల వెంకన్న, సిలువేరు శ్రీధర్, ఐత సుధాకర్, పులి శ్రీనివాస్, కొండేటి బాలకృష్ణ, ఎర్ర ప్రేమ్‌రాజ్, ఎర్ర శ్రీకాంత్, అంగోతు లచ్చిరాం, చీటూరి రాజు, కొండేటి సుధాకర్, కొండేటి మహేందర్, కొండేటి సాంబయ్య, పార్నంది రాజు, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

సంగెం : కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ కళావతి తెలిపారు. స్థానిక ఊర చెరువులో ఉపాధి హామీ పథకం పని చేస్తున్న కూలీలను శుక్రవారం ఆమె కలిసి మాట్లాడారు. వరంగల్ ఎంపీగా కడియం కావ్యకు ఓటేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉపాధి కూలి రూ.400కు పెరుగుతుందని తెలిపారు. కూలి పెంపు, ఉపాధి హామీ రక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజు, నాయకులు గుండేటి రాజు, మోహన్, సాంబయ్య, కోటేశ్వర్, సునీల్, రాజేశ్, శ్రీకర్, మల్లికార్జున్, రవి, శ్రీను, రియాజ్, బాబు పాల్గొన్నారు.

మాతృత్వం గొప్ప వరం



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి కల్పన

నర్సంపేట : సృష్టిలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న మాతృత్వం గొప్ప వరమని బ్రహ్మకుమారి కల్పన తెలిపారు. పట్టణంలోని 4వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ల నల్ల భారతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఏఎల్ఎంఎస్ కమిటీ సమావేశానికి కల్పన హాజరై మాట్లాడారు. గర్భిణులు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రసవానికి మానసికంగా సంసిద్ధులు కావాలని సూచించారు. ఆహార అలవాట్లను మెరుగు పర్చుకోవాలని చెప్పారు. మానసిక, సాంఘిక అంశాల్లోనూ సానుకూల దృక్పథంతో మెలగాలని తెలిపారు. ఆందోళనకరమైన విషయాలు వినడం, చిత్రాలు చూడడం వల్ల శిశువుపై దుష్ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. గర్భిణులకు మెడిటేషన్ అవసరమని చెప్పారు. మెడిటేషన్ పద్ధతులను వివరించి మూడు నిమిషాలు చేయించారు. అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం గర్భిణులకు అమ్మ ఒడిలాంటిదన్నారు. అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి ధర్మభాయి, అంగన్‌వాడీ టీచర్ గౌసియా, ఏఎల్ఎంఎస్‌సీ సభ్యులు గడ్డం భవాని, శంకేసి అనిత, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు క్యాతం తేజశ్రీ, ఆర్పీ వేల్పుల రజిత, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

నర్సంపేట రూరల్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరగనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని వైస్ చాన్స్‌లర్‌ను ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ కోరారు. నర్సంపేటలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేయూ పరిధిలోని డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు ఈనెల 6 నుంచి 16 వరకు నిర్వహించడానికి షెడ్యూల్ విడదలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతున్న నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పరీక్షలను జూన్ మొదటి వారానికి వాయిదా వేశారని తెలిపారు. అలాగే కేయూ పరిధిలోనూ పరీక్షలు వాయిదా వేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్, వినయ్, రాజు, రఘు, రమేశ్, ఉదయ్, కార్తీక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాలు



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన ముదిరాజ్ కులస్తులు శుక్రవారం వన భోజనాలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబాలతో కలిసి వనభోజనాలు చేశారు. తొలుత బంగారమ్మ తల్లికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు దొంతరబోయిన సోమలక్ష్మి, మల్లికాంబ, అక్షయ, వెంకటలక్ష్మి, సారమ్మ, ముద్రబోయిన రజిత, అన్నెపు కోమల, రజిత, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని చేను దగ్ధం



దుగ్గొండి : నిప్పంటుకుని చేను దగ్ధమైన ఘటన మండలంలోని స్వామిరావుపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందగా దేవునిగుట్ట ప్రాంతంలోని మృతుడి భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా సాయంత్రం సుడిగాలికి వల్ల కాడులోని నిప్పు రవ్వలు వచ్చి పక్కనే పశువుల మేత కోసం ఏర్పాటు చేసిన ఆరు ఎకరాల కంచె చేనుకు అంటుకున్నాయి. పక్కనే పలువురు రైతులకు చెందిన మొక్కజొన్న చేలు ఉన్నాయి. అప్రమత్తమైన రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం, భారీ ఆస్తినష్టం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



రాయపర్తి : మండలంలోని మొరిపిరాలలోని బెల్ట్ షాపుపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ సీఐ స్వరూప వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన పులిగుజ్జ సరోజన ఇంట్లో తనిఖీ చేయగా రూ.3 వేల విలువైన మద్యం బాటిళ్లు లభించినట్టు తెలిపారు. సరోజనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అర్హులందరూ ఓటేయాలి

చెన్నారావుపేట : పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటేయాలని వినియోగదారుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈగ సత్యనారాయణ కోరారు. వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కోపాకుల చెరువులో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలతో సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరగాని సుదర్శన్‌గౌడ్, క్యాట్కో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మైస వసంత, విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగెల్లి సారంగం, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోసగించేందుకు యత్నం

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



కూలీలతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసగించేందుకు యత్నిస్తోందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపును కాంక్షిస్తూ మండలంలోని నందిగామ, రేలకుంట, రంగాపురం, రాంతీర్థం, శనిగరం, కన్నారావుపేట, మూడుచెక్కలపల్లి, రాంపూర్, నారక్కపేట, రుద్రగూడెం, నల్లబెల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రచారాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను, గ్రామాల్లో ప్రజలను కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే కరువొచ్చిందని, ప్రభుత్వం రైతులను కూలీలుగా మార్చిందని చెప్పారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక మోసపూరిత హామీలు గుప్పించి ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే తరహాలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తే తాను రాజకీయాలు చేయనని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. కాంగ్రెస్ నాయకుల మోసపూరిత ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. కవితను ఎంపీగా అధిక మెజార్టీతో గెలిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, డీసీసీబీ డైరెక్టర్ చెట్టుపల్లి మురళీధర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, తక్కళ్లపల్లి మోహన్‌రావు, ఇంగ్లే శివాజీ, మామిండ్ల మోహన్ రెడ్డి, మాలోత్ ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశ సమగ్రాభివృద్ధి



వర్ధన్నపేట : మాట్లాడుతున్న విశాల్



పర్వతగిరి : మాట్లాడుతున్న శ్రీధర్

వర్ధన్నపేట : ప్రధానిగా మోదీ అందించిన పాలనలోనే దేశ సమగ్రాభివృద్ధి జరిగిందని ఆ పార్టీ నాయకుడు అరూరి విశాల్ తెలిపారు. వరంగల్ ఎంపీగా అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన ఆధ్వర్యంలో మండలంలోని కడారిగూడెంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడారు. మోదీ పాలనను ప్రజలు చూశారని చెప్పారు. మళ్లీ కేంద్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తే దేశంలో మరింత పటిష్టమవుతుందని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. బీజేపీని కేంద్రంలో మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేలా వరంగల్ ఎంపీగా అరూరి రమేశ్‌ను గెలిపించుకోవాలని సూచించారు. తద్వారా వరంగల్ నగర అభివృద్ధికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రాయపురం కుమారస్వామి, కుందూరు మహేందర్‌రెడ్డి, పింగిళి సంపత్‌రెడ్డి, పింగిళి రాజేందర్‌రెడ్డి, గుడ్ల సుభాష్, నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, యుగందర్‌రెడ్డి, కంజర్ల కనకయ్య, యాదవరెడ్డి పాల్గొన్నారు.

చింతనెక్కొండలో..

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. వరంగల్ ఎంపీగా ఆరూరి రమేశ్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీజేపీ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు లభిస్తాయని తెలిపారు. ప్రతీఒక్కరు పార్టీలకు అతీతంగా బీజేపీకి ఓటు వేసి ప్రధాని మోదీ పాలనను బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరారపు పిచ్చిరెడ్డి, బత్తిని దేవేందర్, దౌడోజు సాంబయ్య, ఓరుగంటి కుమార్, పిల్లల రాములు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంలో భద్రత కీలకం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చంద్రమౌళి, తదితరులు

పర్వతగిరి : విద్యుత్ వినియోగంలో భద్రత కీలకమని ఆ శాఖ ఏడీ చంద్రమౌళి తెలిపారు. విద్యుత్ భద్రత వారోత్సవాల నేపథ్యంలో ముద్రించిన కరపత్రాలను మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందికి, వినియోగదారులకు అవగాహన కల్పించారు. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని, గదిలో ఎవరూ లేనప్పుడు ఫ్యాన్‌లు, లైట్లు ఆర్పివేయాలని, నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ కుక్కర్లకు బదులు ప్రెషర్ కుక్కర్లు వాడాలని, వ్యవసాయానికి రైతులు డీఎస్ఎం పద్ధతులను పాటించాలని సూచించారు.

ఎన్నికల్లో కీలక పాత్ర పోషించండి

ఖిలా వరంగల్: జాతీయ సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ ఎన్నికల్లో యువత కీలక పాత్ర పోషించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ సూచించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తుమ్మెర భవనంలో ఏఐవైఎఫ్ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడారు.

పేదలకు సేవ చేయడమే రెడ్‌క్రాస్ లక్ష్యం

దామెర : పేదలకు సేవ చేయడమే రెడ్‌క్రాస్ లక్ష్యమని రాష్ట్ర పాలక వర్గ సభ్యులు శ్రీనివాసరావు, రమణారెడ్డి తెలిపారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మండలంలోని ల్యాదెళ్లలో శుక్రవారం వృద్ధులకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో వారు మాట్లాడారు. వృద్ధులకు ఇంటి వద్దే సేవలు అందించేందుకు శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు కిషన్‌రావు, తాహెర్ మసూద్, సిబ్బంది శివకుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గూడూరు : మండలంలోని గాజులగట్టుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గోపగాని మహేందర్‌గౌడ్ (50) నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించారు. తొలుత మహేందర్ గౌడ్ మృతదేహానికి నివాళులర్పించారు.